# దిక్కుమాలిన వేషం

సితార సుబ్బలక్ష్మికి అఖిలభారత ఉత్తమనటిగా బహుమతి పొందాలన్న యావ కలిగింది. యింతవరకూ సుబ్బలక్ష్మి ఎన్నో వేషాలు వేసింది. అవన్నీ హీరో వెంట జంటగా పాటలు పాడుతూ డ్యాన్సుచేయడం లాంటివే! హీరోయిన్ కాకముందు సుబ్బలక్ష్మి కొన్నాళ్ళు నక్షత్రాల హోటల్లో గుడ్డలిప్పె డ్యాన్సు చేసింది. ఆ అందం, అవయవాల సొంపూ చూసే; ఓ పెద్దపొట్టగల ప్రొడ్యూసరు సినిమాలకు తెచ్చాడు. కొన్నాళ్ళు నృత్యతారగా చలామణీ అయింది. ఆతర్వాత 'ఏమండీ!' అన్న డైలాగులు చెప్పడం నేర్చుకుని హీరోయిన్ అయింది.

డబ్బు, పేరు, కీర్తి వచ్చాయి. కాకపోతే వుత్తమనటి అవార్డ్ గూడా వస్తే, ఈ జన్మకిది చాలు అనుకుంది. అనుకున్న వెంటనే పి. ఏ. ను పిల్చి మనసులోని కోర్కెను వెళ్ళగక్కింది.

సుబ్బలక్ష్మి పి. ఎ., శ్రీ సింహశ్రీ హీరో అవుదామని పచ్చి, సైడు హీరో కూడా కాలేక, ఎగస్ట్రావేషాలేశాడు. తిండికికూడా గడవనిస్థితివచ్చేసరికి, కథ, మాటలు, పాటలు వ్రాశాడు. డబ్బింగు కళాకారుడుగా కొన్నాళ్ళు అవతారమెత్తాడు. ప్రొడక్షన్ మేనేజరు చేశాడు. దర్శకత్వశాఖలో నలిగాడు. ఎన్ని శాఖల్లో వేలుపెట్టి పైకొద్దామన్నా ఉహుఁ కల్సిరాక, వైరాగ్యం వచ్చేసి, ఖర్మసిద్ధాంతాన్ని నమ్మినవాడై, సుబ్బలక్ష్మి దగ్గర పి. ఏ. గా చేరాడు.

సింహశ్రీ ఆలోచనచేసి "అమ్మా ఇంతవరకూ ఉత్తమనటి బహుమతి పొందిన వాళ్ళ జీవితచరిత్రలు, వాళ్లేసిన వేషాలు వగైరాలు పరిశీలించిన మీదట తేలిందేమిటంటే, అడుక్కుతినే వేషాలకే, ఆ అవార్డ్ లిస్తున్నారు.

ఆ తర్వాత మీ యిష్టం !" అని సుబ్బలక్ష్మికి చెప్పాడు.

"నేనూ అడుక్కుతినే వేషాలేస్తాను."

"అమ్మా మీ రొక్కరే అడుక్కు తింటే లాభంలేదు. సినిమా తీశాక ప్రొడ్యూసరు అడుక్కు తినాలి, సినిమా దర్శకుడు అన్నమో రామచంద్రా అని రోడ్లమీదపడి ఎలుగెత్తి అరవాలి. తీసిన సినిమా చూసేవాడు వుండగూడదు. కథ, మాటలు, సౌండు, లైటింగ్ వగైరా లేనీ వుండగూడదు. సినిమాచూసే జనం ఈ దిక్కుమాలిన ఎవార్డ్ సినిమాకొచ్చామేరా అనుకోవాలి. ఆటఆటకీ జనం పల్చబడాలి. ప్రతికలవాళ్ళను బాగా మచ్చిక చేసుకుని బాబోయ్ యిది కళాఖండం అని వ్రాయించుకోవాలి పేపర్లనిండా. వీలయితే ఓ మంత్రిగారికి ఆ సినిమాచూపించి, ఏమిటది సినేమానా ! సత్యజిత్తురాయ తీసిపారేసిన ఆర్ట్‌ఫిల్మా !" అని పొగిడించుకోవాలి!'' ఆని సింహశ్రీ వివరించాడు.

సుబ్బలక్ష్మి నవ్వింది, నవ్వి, "సింహంగారూ ! మీరు ముప్పయ్యేళ్ళుగా సినమాలలో ప్లాస్టిక్ పువ్వులా ఎందుకున్నారో తెలుసా? మీకు తెలియదనినాకు తెలుసు. చెబుతా వినుకోండి.

ఓసారి సినిమా తీసిన ప్రొడ్యూసరు మళ్ళ బ్రతికి బట్టకట్టి సినిమా తీయడం కల్ల కనుక ఆడు అడుక్కుతింటానే వున్నాడు. ఇక దర్శకుడుగారూ వాళ్ళు సినిమా తీస్తున్నంతసేపూ తిండి తింటారు. ఆ తర్వాత తిండికి మొహంవాస్తారు. ఇక కథ, మాటలు, సౌండు, లైటింగ్ మొదలైనవి మన సినిమాలకు ఎలాగూ వుండవుగదా, పత్రికలవోళ్ళు మనోళ్ళే, మంత్రులంటావా పట్టుకుందాం దొరక్కపోతారా! కనుక ఎవార్డ్ సినిమాలో దిక్కుమాలినవేషాం వేసేందుకు నేను సిద్ధం. ఏర్పాట్లు చెయ్ !'' అంది సుబ్బలక్ష్మి.

ఏర్పాట్లు చకచకా జరిగిపోయ్యాయి.

ధనలాల్‌జీ ప్రొడ్యూసరు. కథ, మాటలు, పాటలు, స్క్రీన్ ప్లే, దర్శకత్వం వగైరాలు శ్రీ నారాయణ్‌దోసె. సంగీతం వినిపించేదుకు మనోవేదన్, ఛాయాగ్రహణానికి రామణ్ణ. యిలా ప్రతి శాఖకూ ఏరికోరి నియమించడం జరిగింది.

నక్షత్రాల హోటల్లో పెద్ద విందు, పత్రికలవారితో సంభాషణ ఏర్పాటు అయ్యాయి. కేంద్రంలోంచి ఓ చోటా మంత్రి, రాష్ట్రంనుంచి ఓ బడా మంత్రి ఆనాటి విందుకొచ్చి సుబ్బలక్ష్మి నిర్ణయాన్ని పొగిడారు.

మరుసటి వారం అన్ని సినిమా పేపర్లు సుబ్బలక్ష్మి బొమ్మ ముఖచిత్రంగా వేశాయి పంచరంగుల్లో. ఇదంతా ఖర్చు ధనలాల్‌జీ పెట్టుకున్నాడు.

అప్పుడు కథ మీద కూర్చున్నారు డైరెక్టరూ, సింహశ్రీ, సంగీతం, కెమెరా శాఖల వాళ్ళు అంతాకల్సి మూకుమ్మడిగా.

మొత్తం సినిమాలో మూడు రేపులు, రెండు చావులు ఆకలివి, వుండాలని తీర్మానించారు. చివర్లో హీరోయిను తిండికోసం ఓ హోటల్‌లోకి ప్రవేశించి, డైనింగ్ హాలులో జనాన్నుద్దేశించి ఉపన్యాసంలాంటి సందేశం యివ్వడం, సినిమాకు హైలైట్.

కథ ఓకే అయింది. యిక మాటలు అల్లేందుకు డైరెక్టరు ఉదకమండలం వెళ్ళిపొయ్యాడు.

"అమ్మా! మన కథఅంతా గుడిసెల్లో కదా నడిచేది. అందువల్ల మీరు అక్కడో రోజు గడిపి, వాళ్ళ జీవితవిధానం తెలుసుకోండి. మనకు పబ్లిసిటీకి పనికొస్తుంది. రేపు ఎవార్డ్ సంఘానికి మనం చెప్పొచ్చు, మా సుబ్బలక్ష్మి

గారు 24 గంటలూ, పేదవారి జీవితాన్ని పరిశీలించి మరీ వేషంవేశారని" అని సింహశ్రీ మనవిచేసుకున్నాడు.

సుబ్బలక్ష్మికి ఆ సలహా నచ్చింది. సింహశ్రీ బుర్ర చాలా గొప్పదన్న ఆలోచనా కలిగింది. కానీ 24 గంటలు షూటింగ్ ఎగగొట్టడమెలా? ఇంకా రెండేళ్ళదాకా ఖాళీలేదు. అందుకే ఎందరో ముందుకొచ్చినా పెళ్ళిచేసుకుందుకు తీరికలేక వాయిదావేస్తూ వచ్చింది.

ఏ కుంటిసాకోచెప్పి, షూటింగ్‌కు ఎగనామం పెడితే, బలిసిన ప్రొడ్యూ

సర్లూ, హీరోలు ఫోనెత్తి, "వళ్ళెలావుంది? పదినిముషాల్లో రాకపోతే చూస్కో" అని వర్తమానం పంపుతారు. ఎట్లా?

''పోనీ రాత్రి ఒంటిగంటతర్వాత వెడితేనో?''

''వెడతారు. కానీ అప్పుడు అంతా నిద్దరోతారు. మీరెలాచూస్తారు? ఏంచూస్తారు?''

సుబ్బలక్ష్మి నవ్వింది "సింహశ్రీ! అబ్బే లాభంలేదయ్యానువు. అన్నం అంతా పట్టుకుచూడాలా! ఊరికే చూస్తే చాలదుటయ్యా. ఏర్పాటుచెయ్యి ఈ రాత్రికే షూటింగ్‌నుంచి సరాసరి అలా గుడిసెలోకే వెడతాను, అక్కడ జీవితాన్ని చూస్తాను. ఎవార్డ్ సంపాయిస్తాను'' అంది సుబ్బలక్ష్మి.

సుబ్బలక్ష్మి పట్టుదల సింహశ్రీకి తెలుసు. ఎక్కడో మారుమూలగుడ్డలుతికే సుబ్బమ్మ, మద్రాసులాంటి మహా నగరమొచ్చి చెలికత్తెగా వేషం మొదలెట్టి, కొన్నేళ్ళల్లో దక్షిణభారత అగ్రశ్రేణి అందాల తారగా వెలుగొందుతున్నదంటే కారణం పట్టుదల! అనుకున్నది సాధించి తీరుతుంది సుబ్బలక్ష్మి.

సింహశ్రీ రహస్యంగా ఏర్పాట్లు చేశాడు. రహస్యం ఎందుకంటే, ఫలానా

తార, ఇలా ఫలానా మురికివాడలో గడపబోతున్నదంటే జనం వేలం వెర్రిగా ఆ మురికివాడకొస్తారు, పత్రికలవాళ్ళు, ఫోటోగ్రాఫర్లు అబ్బో! అల్లరవుతుంది. అందుకని రహస్యం.

సుబ్బలక్ష్మి దగ్గర పనిచేసే ఎల్లమ్మ వూరి బయట గుడ్డోళ్ళు, కుష్టోళ్ళు, దొంగలు, దోపిడీదార్లు వుండే మురికివాడలో వుంటుంది. ఆ యింట్లో సుబ్బలక్ష్మి వుండేందుకు సింహశ్రీ ఏర్పాట్లుచేశాడు.

*　　　　*　　　　*

సుబ్బలక్ష్మి మురికివాడలోని గుడిసెలో వుండొచ్చాక వారం ఆస్పత్రి పాలయింది. ఆ తర్వాత రెండు నెలలు యింటి పట్టునే విశ్రాంతి అవసరమైంది. ఆఖరికి ప్రెస్‌వాళ్ళనూ, హీరోలనూ, అతిదగ్గరి ప్రొడ్యూసర్లను చూడనీయలేదు. సింహశ్రీకి ఉద్యోగం ఊడింది. ఎల్లమ్మను పోలీసులు పట్టుకున్నారు.

ఆ రాత్రి! అసలేం జరిగింది?

సుబ్బలక్ష్మి అస్పత్రి పాలెందుకయ్యింది.

ఓ పేపరు సుబ్బలక్ష్మికి అమ్మవారొచ్చి ముహం పాడయింది, ఇక తెరకు పనికిరాదు అని వ్రాసింది. ఇంకో పేపరు సుబ్బలక్ష్మి జీవిత చరిత్ర ప్రకటిస్తూ, ఆమె కొన్ని వేల గంటలు విశ్రాంతి లేకుండా నటించడం వల్ల, ఆరోగ్యం దెబ్బతిన్నది అని వ్రాసింది.

పుకార్లు రేపటంలో ప్రముఖమైన వారపత్రిక, కొన్నేళ్ళుగా చేసిన పాపాలు ఘోరాలురోగాలరూపంలో ఆమెను పూర్తిగా నాశనం చేశాయి అని బుకాయించింది.

నిజం సుబ్బలక్ష్మికి

సింహశ్రీకి తెలుసు

సుబ్బలక్ష్మి "ఎవార్డ్ కోసం గుడిసెకెళ్ళా మామూలు గుడ్డల్తో. ఓ మంచం ఈక్కిది తప్ప మరేం లేదు ఆ గుడిసెలో. పాత గుడ్డలు, వంకరబోయిన సత్తుగిన్నెలు బూజు, దోమలు కాస్సేపు వాంతిఅయ్యేలా అనిపించింది. పైగా ఏంతినలా! తెల్లవారుఝాము మూడు. ఓ గంటో, అరగంటో నిద్రపోతే బావుండు అనుకుంటున్నా....నిద్రపడుతూ వుంది.

ఓ దున్నపోతులాంటి వాడొచ్చాడు. బాగా నాటుకొట్టేసున్నాడు.

"నువ్వెవతవి"

"నువ్వెవరూ?"

క్షణం నిశ్శబ్దం.

"ఓసి నీయవ్వ నువ్వు సుబ్బాంవిగదూ ఏందీ యీడున్నావ్?"

సుబ్బలక్ష్మి ఏదో చెప్పబోయింది. వచ్చినవాడు చెప్పనియ్యలేదు. విలన్‌లా ఆమె మీదబడ్డాడు.

సింహశ్రీ కథ....

"మీతోడు. నేవెళ్ళేసరికి, సుబ్బలక్ష్మి కుక్కలుచింపిన విస్తరిలావుంది. గుడ్డలు చినిగిపోయున్నాయి. బుగ్గలనిండాగంట్లు. పెదిమవాచివుంది. జుత్తంతా రేగివుంది. అచ్చు 'ఆకలిమంటల' సినిమాలో హీరోయిన్‌లా వున్నారు-అన్నా. ఆమె నారూపంలోచూసి. మీరిలా వేషంగడితే ఏవార్డ్‌ఖాయిం అనిఅంటుండగానే అవిడ మొహం పగిలేలాకొట్టి వెళ్ళిపోయింది."

సుబ్బలక్ష్మికి ఎవార్డ్ వచ్చింది. సన్మానాలు జరిగాయి. విదేశాలుగూడా వెళ్ళి వచ్చింది. కానీ ఆమెకు జవాబులు దొరకని ప్రశ్నలు : ఆ రాత్రి ఆ

గుడిసెలోకి మాజీ మొగుడు రజాక్ ఎలా వచ్చాడు? వాడికీ సంగతి ఎలా తెలిసింది?

సింహశ్రీ రోడ్డుమీద అడుక్కుతింటున్నాడు. అతడికి సమాధానం దొరకని ప్రశ్న?

గుడిశలో కెళ్ళిన సుబ్బలక్ష్మిని రేప్‌చేశిందెవరూ? ★

---

( స్వాతి నవంబరు—1983 )